క్లుప్తంగా

రేపు బాకూరుపాలెంలో వైఎస్సార్‌సీపీ మండల సమావేశం

తగరపువలస: ఆనందపురం మండల వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకుల సమావేశం మంగళవారం ఉదయం 9 గంటల నుంచి బాకూరుపాలెం వద్ద పంతులు గారి కల్యాణ మండపం(సర్పంచ్ దవళ నాగేశ్వరరావు)లో జరుగుతుందని పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం తెలిపారు. ఈ సమావేశంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంపై విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తామన్నారు. పార్టీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ మండల కమిటీ అనుబంధ కమిటీల ప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు తప్పక హాజరు కావాలని సత్యం కోరారు.

ఎంఈవోగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసరావు

భీమునిపట్నం: భీమిలి ఎంఈవో–2గా తాటితూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డొకర శ్రీనివాసరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఈయన స్థానంలో పని చేసిన జయప్రద అనారోగ్య సమస్యతో మెడికల్ లీవ్ పెట్టడంతో ఈయనకు బాధ్యతలు అప్పగించారు.

యువకుడిని కాపాడిన లైఫ్‌గార్డ్స్



కౌన్సెలింగ్ ఇస్తున్న మెరైన్ సీఐ శ్రీనివాసరావు

కొమ్మాది: రుషికొండ బీచ్‌లో ఆదివారం సాయంత్రం ఒక యువకుడు అలల ఉధృతికి కొట్టుకుపోతుండగా, అప్రమత్తమైన లైఫ్‌గార్డ్స్ అతడి ప్రాణాలు కాపాడారు. వివరాలివి.. బిహార్‌కు చెందిన ఐదుగురు యువకులు సరదాగా గడిపేందుకు రుషికొండ బీచ్‌కి వచ్చారు. సముద్రంలో స్నానం చేస్తుండగా, అలల తీవ్రత ఎక్కువగా ఉండటంతో వారిలో ఒకరైన అభిషేక్ కుమార్ కొట్టుకుపోయాడు. అక్కడే విధుల్లో ఉన్న లైఫ్‌గార్డ్స్ ఎస్.నూకరాజు, ఎం.అమ్మోరు, చిన్నప్పన్న, దేవ వెంటనే రంగంలోకి దిగిన సురక్షితంగా అభిషేక్‌ను తీరానికి తీసుకువచ్చారు. యువకులకు మెరైన్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు. ప్రాణాలకు తెగించి యువకుడిని కాపాడిన లైఫ్‌గార్డ్స్‌ను మెరైన్ సీఐ శ్రీనివాసరావు అభినందించారు.

హోమియో మందుల పంపిణీ



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

భీమునిపట్నం: భీమిలిలోని కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ద్వారా దాని చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ పర్యవేక్షణలో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం జరిగింది. ఇందులో 88మంది రోగులు పాల్గొనగా వారిని వైద్యులు టి.జగన్నాథరావు, మోహన్ పరీక్షించి అవసరమైన మందులు అందించారు. ఫౌండేషన్ ప్రతినిధులు కె.ఎస్.ఎన్.మూర్తి, కె.భానోజీరావు, కె.శ్రీనివాసరావు, కె.చంద్రశేఖర్, సభ్యులు రాంబాబు, శంకర్, శ్రీనివాసరావు, తాతాజీ, రాము, కిశోర్, లక్ష్మణ్, సాయి పాల్గొన్నారు.

ముగిసిన చలివేంద్రం



మజ్జిగ పంపిణీ చేస్తున్న దాతలు, నిర్వాహకులు

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయం వద్ద గత కొద్ది నెలలుగా ఆది, ఇతర రోజుల్లో నిర్వహిస్తున్న చలివేంద్రం ఆదివారంతో ముగిసింది. దాతలు, పెద్దలు, కమిటీ సభ్యులతో పాటు పీఎంపాలెం పద్మశాలీ ఆత్మీయ సేవా సంఘం తదితరుల సహాయ సహకారాలతో దీన్ని నిర్వహిస్తున్నారు. ఆఖరి ఆదివారం మధురవాడకి చెందిన బార్ల సుధీర్‌కుమార్, స్వప్న దంపతులు సహాయ సహకారాలతో మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులతో పాటు పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు, ఇతర కార్యవర్గ సభ్యులు కేవీ నాగేశ్వరరావు, కానూరి శ్రీరాములు, సోర్నంపూడి గణేష్, బడిగంటి పాండురంగ విఠల్, ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, కార్యదర్శి నాగోతి తాతారావు, కార్యవర్గ సభ్యులు పిళ్లా శ్రీనివాసరావు, దుక్కవరం, గూడేల రాజు, బోగవిల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

నిలువెత్తు నిర్లక్ష్యం

ప్రమాదాలకు ఆస్కారమవుతున్న శ్లాబులు • చలనం లేని పాలకులు



మధురవాడ డైలీ మార్కెట్ వద్ద కాలువపై నామమాత్రంగా ఉన్న పలకలు

మధురవాడ: ప్రజా సమస్యలు అధికారులకే కాదు, ప్రజా ప్రతినిధులకూ ఏమాత్రం పట్టడం లేదు. నేరుగా నాయకులు, పీజీఆర్ఎస్‌లో అధికారులకు మధురవాడ పౌర సంక్షేమ సంఘం, సీఐటీయూ వంటి ప్రజా సంఘాలు ఫిర్యాదు చేసినా అవి బుట్టదాఖలు అవుతున్నాయి అనడానికి ఏళ్ల తరబడి ప్రమాదాలకు స్వాగతం పలుకుతూ కాల్వలపై ఉన్న శ్లాబులే సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఈ సమస్య పత్రికల్లో పలుమార్లు కథనాలు వచ్చినా పరిస్థితిలో ఎటువంటి మార్పు లేదు. అలాగే పలు ప్రజా సంఘాల నాయకులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా జాతీయ రహదారిని ఆనుకుని మధురవాడ, చంద్రంపాలెం, మిథిలాపురి వుడా కాలనీ జంక్షన్, చంద్రంపాలెం హైస్కూల్ తదితర చోట్ల శ్లాబులు పూర్తిగా శిథిలమై ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఇక్కడ తరచూ ప్రమదాలు కూడా జరుగుతున్నాయి. పలుమార్లు ఇందులో ఆవులు పడి గాయాల పాలయ్యాయి. ప్రస్తుతం తాజాగా డాక్టర్ వైఎస్సార్ ఏసీసీ–వీడీసీఏ క్రికెట్ స్టేడియం నుంచి కొమ్మాది జంక్షన్ వరకు సుమారు రు. 80 లక్షల వ్యయంతో హైవే సర్వీసు రోడ్డును ఆనుకుని ఉన్న భారీ కాల్వల్లో సిల్ట్ తొలగింపు పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శ్లాబుల మరమ్మతులు, శ్లాబులు లేని చోట కొత్తవి ఏర్పాటు చేయాలని ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు. అధికారులు తక్షణం స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



మధురవాడ బస్టాప్ వద్ద కాలువపై ప్రమాదకరంగా శ్లాబులు



వుడా కాలనీ జంక్షన్ వద్ద భారీ కాలువపై అస్తవ్యస్తంగా ఉన్న శ్లాబులు

కూటమి పాలనా వైఫల్యాలను చాటుదాం



మజ్జివలసలో వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడుతున్న భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు

తగరపువలస: చంద్రబాబు పాలనలో ఎప్పుడు చూసినా ప్రజలకు హామీలు ఇవ్వడమే తప్ప నెరవేర్చడం ఉండదని వాటిని దృష్టిలో పెట్టుకుని 'చంద్రబాబు ష్యూరిటీ మోసం గారంటీ'కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్త, నాయకుడు విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం భీమిలి మండలం మజ్జివలసలో సీనియర్ నాయకుడు దాట్ల పెదబాబు ఆధ్వర్యంలో జరిగిన పార్టీ మండల సమావేశంలో ఆయన నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. గతంలో అధికారంలో లేనప్పుడు కూడా మనం గడప గడపకు వెళ్లి ప్రజల తరఫున నిలబడ్డామని గుర్తు చేశారు. ఇంటింటికీ వెళ్లి బాండ్లు ఇచ్చి ఆశ పెట్టి ఓటర్లను తమ వైపు తిప్పుకున్నారన్నారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి ఏడాది గడచినా పూర్తిగా అమలు చేయలేదన్నారు. ఉచిత బస్సు పథకం అమలవుతుందో లేదో వారికే తెలియదన్నారు. ఖరీఫ్‌కు సంబంధించి విత్తనాలు, ఎరువులు, యూరియా, కొత్త పెన్షన్ల ఊసే లేదన్నారు. ఇప్పటికీ ప్రతి గ్రామంలో 40 నుంచి 50 మంది వరకు పెన్షన్లకు అర్హత ఉండీ ఎదురు చూస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ హామీలలో ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, ఉచిత గ్యాస్ సిలిండర్లు, 50 ఏళ్లకే పెన్షన్ వంటి పథకాలు ఇవ్వాలని ప్రజల తరఫున ప్రభుత్వంపై పోరాటం చేయాలన్నారు. ఏడాది కాలంగా నాడు–నేడు పథకం కింద పాఠశాల భవనాలలో కదలిక లేదన్నారు.

ప్రతి ఇంటికీ వెళ్దాం..

బాబు ష్యూరిటీ మోసం గారంటీ గురించి ప్రజలకు వివరించేందుకు గ్రామస్థాయి కమిటీలు వేసుకుని ప్రతి ఇంటికి వెళ్లి వివరిద్దామన్నారు. పార్టీ సూచించిన కరపత్రాలలో క్యూఆర్ కోడ్ ద్వారా చంద్రబాబు ఇచ్చిన నెరవేరని హామీలు, వైఎస్సార్‌సీపీ పాలనలో అమలు చేసిన నవరత్నాలు ఇతర సంక్షేమ పథకాల గురించి వివరిద్దామన్నారు. ఈ సందర్భంగా మండల కమిటీలకు సంబంధించి పంచాయతీల వారీగా నాయకుల అభిప్రాయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ దంతులూరి వాసురాజు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, యలమంచిలి సూర్యనారాయణ, కేపీ సత్యనారాయణ, సరగడ రఘునాథరెడ్డి, మద్దిల వెంకటరమణ, దుంపల ప్రభాకర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మజ్జి సూరినాయుడు, తుపాకుల అప్పలరాజు, లచ్చుబుగత జగదీశ్వరరావు, కొయ్య రామకృష్ణారెడ్డి, చెల్లూరు నగేష్, పొట్నూరు చంద్రశేఖర్, సమ్మిడి శ్రీనివాసరావు, బొడ్డు దుర్గారావు, మేరుగు సూరిబాబు, దూడ ధనంకొండ, తోట ఎల్లారావు, వెంపాడ సూరిబాబు, బోని సన్నిబాబు, పల్లా సన్యాసిరావు, అక్కరమాని అప్పలనాయుడు, కొంకి శ్రీను, ముద్దాడ సూరప్పడు, కరుభుక్త అప్పలనారాయణ, చెల్లూరు సంతోష్, కొయ్య రమేష్, రవ్వ ఈశ్వరరావు, మద్దిల శివ, తుపాకుల అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన భీమిలి మండల నాయకులు

మురుగు తొలగింపునకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

మధురవాడ: జీవీఎంసీ జోన్–2 పరిధిలో శానిటేషన్ ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలు చేపడుతున్నట్టు వైద్యాధికారి కిషోర్ తెలిపారు. ఐటీ సెజ్ జంక్షన్‌లో మురుగు నీరు తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఇక్కడి సమస్యపై 'మురుగు కూపంగా ఐటీ సెజ్ జంక్షన్' అనే శీర్షికన ఆదివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఇక్కడ ఉన్న మారుతీ సర్వీస్ సెంటర్, ఇతర చోట్ల నుంచి నీరు, వ్యర్థాలు వస్తున్నాయని, మురుగు నీరు తొలగింపునకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే ఇక్కడ ఆదివారం సిబ్బందితోపాటు సెప్టిక్ క్లీనర్ ద్వారా బ్లాక్ అయిపోయిన కాలువల్లో చెత్త తొలగించామన్నారు. ఈ జంక్షన్‌లో మెయిన్ వాల్వ్ బ్లాక్ అయ్యిందని, దీనిని ఓపెన్ చేయాల్సి ఉందని, విషయం ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐలా) జోనల్ మేనేజర్ దృష్టికి, జీవీఎంసీ ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకువెళ్లినట్టు చెప్పారు. ఈ మేరకు ఇక్కడ మురుగు నీరు తొలగింపునకు తాత్కాలిక చర్యలు చేపట్టారు. పూర్తి స్థాయి చర్యల కోసం సంభందిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు జోన్–2 వైద్యాధికారి తెలిపారు.



ఐటీ సెజ్ జంక్షన్ వద్ద కాలువలో చెత్త తొలగింపును పర్యవేక్షిస్తున్న వైద్యాధికారి కిషోర్

బకాయిల కోసం 900 మంది కార్మికుల దరఖాస్తులు

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు మూత కారణంగా యాజమాన్యం నుంచి కార్మికులకు రావలసిన బకాయిల కోసం ఈ నెల 1 నుంచి 20 వరకు అవకాశం కల్పించగా.. మొత్తం 900 మంది దరఖాస్తు చేసుకున్నారు. గత నెలలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, కార్మిక శాఖ అధికారుల సమక్షంలో మిల్లు యాజమాన్యం, కార్మిక సంఘాల మధ్య జరిగిన చర్చల కారణంగా దరఖాస్తులు స్వీకరించిన సంగతి తెలిసిందే. చిట్టివలస లేబర్ కార్యాలయానికి వచ్చిన దరఖాస్తుల్లో వెరిఫికేషన్ కోసం వచ్చిన వాటిలో 380 మందికి ఇప్పటికే బకాయిలు అందాయి. గ్రాడ్యుటీ, పీఎఫ్, ఫిక్స్‌డ్ డిపాజిట్లకు సంబంధించి 520కు పైగా దరఖాస్తులు వచ్చాయి. వీటిపై త్వరలో ముగింపు నిర్ణయం తీసుకోనున్నారు. ఫ్యామిలీ సర్టిఫికెట్ల కోసం 10 మంది దరఖాస్తుదారులు వేచి ఉన్నారు. ఆదివారంతో దరఖాస్తుల స్వీకరణ ముగిసిందని మిల్లు యాజమాన్య ప్రతినిధులు తెలిపారు.

కుమ్మరించిన వాన



వర్షానికి ఖాళీగా దర్శనమిస్తున్న తగరపువలస మెయిన్‌రోడ్డు

తగరపువలస: తగరపువలస పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం నుంచి ఉక్కపోతతో ఇబ్బందులకు గురి చేసిన వాతావరణం.. సాయంత్రం అనూహ్యంగా చల్లబడింది. మధ్యాహ్నం చిరుజల్లులు కురిసినా, సాయంత్రం 4 గంటల నుంచి గంటన్నర పాటు కుండపోతగా వర్షం కురిసింది. దీంతో జనజీవనం స్తంభించిపోయింది. రహదారులు జలమయం కాగా.. డ్రైనేజీలు పొంగి ప్రవహించాయి. ప్రైవేట్ మార్కెట్‌లో కూరగాయల వ్యర్థాలు రహదారిపైకి చేరి, మార్కెట్ బురదగా మారిపోయింది. సాయంత్రం జరగాల్సిన వ్యాపారాలు మందగించాయి. అయితే, కొన్ని రోజులుగా వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఇది ఊరటనిచ్చింది. ఈ వర్షంతో నారుమడులకు ఊపిరి పోసినట్టైందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.



పద్మనాభం జంక్షన్‌లో రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న వర్షపు నీరు

వరి నారుకు ఊపిరి

పద్మనాభం: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం వాన కుమ్మేసింది. పద్మనాభం, విజయానందపురం, మద్ది, కృష్ణాపురం, తునివలస, రెడ్డిపల్లి, నరసాపురం, పొట్నూరు, చిన్నాపురం గ్రామాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వర్షం ఏకధాటిగా కురిసింది. పద్మనాభం జంక్షన్, తునివలస, నరసాపురం జంక్షన్లలో రోడ్డు మీద నుంచి వాన నీరు ప్రవహించింది. ఎండ తీవ్రంగా ఉండటంతో ఇప్పటికే వేసిన వరి నారు ఎండిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ వర్షం వరి నారుకు ఉపశమనం కలిగించింది.

కక్ష సాధింపు రాజకీయాల్లో బాబు దిట్ట



బింగి హరికిరణ్‌రెడ్డి

తగరపువలస: కక్ష సాధింపు రాజకీయాలు చేయడంలో చంద్రబాబు దిట్ట అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన భీమిలిలో చంద్రబాబుపై విమర్శనాస్త్రాలు గుప్పించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 13 నెలలు గడిచినా ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా చేసిన రూ.1.75 లక్షల కోట్ల అప్పులు ఏమయ్యాయో చెప్పలేని పరిస్థితి నెలకొని ఉందన్నారు. దురుద్దేశ్యంతో ఒక్క ఆధారమూ లేకపోయినా రూ.2 వేల కోట్ల లిక్కర్ స్కాం అంటూ ఆరోపణలు చేస్తున్నారన్నారు. 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు అనేక లిక్కర్ బ్రాండ్లకు అనుమతులు ఇవ్వడమే కాకుండా గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుషాపులు నడిపిన ఘనత ఉందన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టును తీవ్రంగా ఖండించారు. ఇది ఎల్లో మీడియా, చంద్రబాబు సృష్టించిన పిట్టకథ అని హరికిరణ్‌రెడ్డి అన్నారు.

ఇస్కాన్‌లో మార్మోగిన హరినామస్మరణ



కొమ్మాది: హరే రామ, హరే కృష్ణ అంటూ సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరం ఆదివారం మార్మోగింది. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ స్వామి, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో అలంకరించారు.

పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ

భీమునిపట్నం: పర్యావరణం పరిరక్షించబడి అందరికీ మేలు జరగాలంటే విరివిగా మొక్కలు నాటాలని గ్రీన్ క్లైమేట్ టీం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు జె.వి.రత్నం అన్నారు. ఆదివారం భీమిలిలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో మొక్కలు నాటారు. అనుకూలమైన ప్రాంతంలోనే మొక్కలు నాటాలని, అప్పుడే మంచి ఫలితాలను వస్తాయని రత్నం అన్నారు. అవసరమైన మేరకు తాము మొక్కలు అందిస్తామని తెలిపారు. విద్యాలయ ప్రిన్సిపాల్ గంగాకుమారి మాట్లాడుతూ ఇక్కడ ఎక్కువ మొక్కలు నాటే అవకాశం ఉందని, ఈ మేరకు మొక్కలు నాటుతామని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ గంగాకుమారి, విద్యార్థినులు

పేకాట శిబిరంపై దాడి

తగరపువలస: తాళ్లవలస పంచాయతీ యాతపేటలోని నిర్మానుష్య ప్రదేశంలో జరుగుతున్న పేకాట శిబిరంపై ఆదివారం మధ్యాహ్నం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. ఎస్ఐ భరత్‌కుమార్ రాజు ఆధ్వర్యంలో హెడ్‌కానిస్టేబుల్ శ్రీను తదితర సిబ్బంది ఈ దాడిలో పాల్గొని 9 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ.51 వేల నగదు స్వాధీనం చేసుకుని భీమిలి పోలీసులకు అప్పగించారు.

సైకిల్‌ను ఢీకొట్టిన కారు

• బాలుడికి గాయాలు



ప్రమాదంలో నుజ్జయిన సైకిల్

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేట దరి రామాద్రికి చెందిన కామేష్ అనే బాలుడు సైకిల్‌పై నగరపాలెం వైపుగా వెళ్తుండగా.. నగరం నుంచి అతివేగంగా వస్తున్న ఓ కారు వెనుక నుంచి సైకిల్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ క్రమంలో కామేష్ దూరంగా ఎగిరిపడిపోగా.. సైకిల్ నుజ్జయింది, 3677 నంబర్ గల కారు ఆగకుండానే వెళ్లిపోయిందని స్థానికులు తెలిపారు. స్థానికులు స్పందించి, తల్లిదండ్రులకు సమాచారమిచ్చి గాయాలపాలైన కామేష్‌ను వెంటనే ఆస్పత్రికి తరలించారు.

తిమ్మాపురంలో ఆక్రమణల తొలగింపు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు భీమిలి బీచ్ రోడ్డు తిమ్మాపురంలోని ప్రభుత్వ స్థలాల ఆక్రమణ రోజురోజుకూ మితిమీరిపోతున్నాయి. ఇదంతా కొండ ప్రాంతం కావడంతో ఇష్టానుసారంగా కొండను తవ్వి ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ క్రమంలో రెవెన్యూ అధికారులకు వచ్చిన సమాచారం మేరకు ఆదివారం సర్వే నంబర్ 379లో ఓ వ్యక్తి ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టాడు. వాటిని ఆర్ఐ కిషోర్ నేతృత్వంలో తొలగించారు. ఇదిలా ఉండగా అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న క్రమంలో కొంతమంది స్థానికులు అడ్డుపడ్డారు. నిర్మాణాలు తొలగించవద్దంటూ రెవెన్యూ అధికారుల విధి నిర్వహణకు ఆటంకం కలిగించారు. వెంటనే రెవెన్యూ అధికారులు విధుల నిర్వహణకు అడ్డుపడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు, భవిష్యత్తులో ఇలాంటి అక్రమ నిర్మాణాలు పునరావృతం కాకుండా ఉండేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్ఐ తెలిపారు.



అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న సిబ్బంది

సామాన్యులకు వజ్రాయుధం సమాచార హక్కు చట్టం

పద్మనాభం: సమాచార హక్కు చట్టం సామాన్యులకు వజ్రాయుధమని చట్టం యాక్టివిస్టుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కిలపర్తి తిరుపతి రావు అన్నారు. పద్మనాభం సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం ప్రజలు తమ కావల్సిన సమాచారం కోసం పౌర సమాచార అధికారికి కోర్టు ఫీ స్టాంపు అంటించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. గరిష్టంగా 30 రోజుల్లోగా దరఖాస్తుదారు కోరిన సమాచారాన్ని ఇవ్వాలన్నారు. సమాచార హక్కు చట్టం గురించి ప్రజలకు తెలిజేసేందుకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ నెల 26వ తేదీన కంచరపాలెంలోని శ్రీచాణక్య డిగ్రీ కళాశాలలో ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సదస్సు జరుగుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలు హాజరు కావచ్చన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం ప్రకారం సమాచారం ఇవ్వడానికి ఇబ్బంది పెడితే 94918 93115 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.



మాట్లాడుతున్న తిరుపతిరావు

పర్యాటక ప్రాంతాలకు సందర్శకుల తాకిడి

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు ఆదివారం పర్యాటకుల తాకిడి గణనీయంగా పెరిగింది. భీమిలి బీచ్, ఎర్రమట్టి దిబ్బలు, కోకోనట్ ఎరీనా బీచ్, రామాద్రి బీచ్, తొట్లకొండ, బావికొండ, రుషికొండ బీచ్, సాగర్‌నగర్ బీచ్ ప్రాంతాల్లో పర్యాటకులు ఉదయం నుండి సాయంత్రం వరకు సందడి చేశారు. చిన్నారులు ఆడుకుంటూ, బీచ్‌లో గడుపుతూ కేరింతలు కొట్టారు.



రుషికొండ బీచ్‌లో పర్యాటకుల సందడి

విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ అందజేత



చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో ఎన్ఎంఎంఎస్ శిక్షణకు హాజరైన విద్యార్థులు



పద్మనాభం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు మెటీరియల్ అందిస్తున్న జగదీష్‌బాబు

తగరపువలస: చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) శిక్షణకు వివిధ పాఠశాలలకు చెందిన 150 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరికి సంతపేటకు చెందిన నందిక శ్రీను అనే వ్యక్తి రూ.30 వేల విలువైన స్టడీ మెటీరియల్ అందించారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు శిక్షణ ఇచ్చారు. ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు గంటాన మోహనరావు, ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు, వీఎస్ కృష్ణా కళాశాల సూపరింటెండెంట్ జీవీ అప్పారావు తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఎన్ఎంఎంఎస్ శిక్షణ తరగతులు ప్రారంభం

పద్మనాభం: పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఆదివారం ఎన్ఎంఎంఎస్ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఎన్ఎంఎంఎస్ పరీక్ష అయ్యేంత వరకు తరగతులు కొనసాగుతాయి. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతులు జరుగుతాయి. మొదటి రోజు 70 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆసరా స్వచ్ఛంద సేవా సంఘం వ్యవస్థాపకుడు రెడ్డిపల్లి జగదీష్‌బాబు తన సొంత నిధులతో ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందజేశారు. హైస్కూల్ ఉపాధ్యాయులు ఎం.వి.కృష్ణకుమార్, విజనిగిరి శంకరరావు, ఉపాధ్యాయులు తాలాడ రామకృష్ణ, కాళ్ల గోపినాథ్, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హరేకృష్ణ వైకుంఠంలో సంగీత కచేరి



శ్రీకృష్ణ లీలలపై గాన కచేరి చేస్తున్న సంగీత జనకులం సభ్యులు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠం వద్ద శ్రీరాధా మధన మోహన మందిరంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఆదివారం నగరానికి చెందిన సంగీత జనకులం సంస్థ సభ్యులు శ్రీకృష్ణ లీలలపై సంగీత స్వరాలు వినిపించారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్వహించిన శ్రీకృష్ణ అర్పణం కార్యక్రమంలో భాగంగా డాక్టర్ గుమ్మలూరి శివశంకర్(గానం), మాస్టర్ సిహెచ్.చాణక్య చంద్ర(మృదంగం), యశోద నందన్(వయొలిన్)లచే సంగీత సేవా కార్యక్రమం నిర్వహించారు. పాటల రూపంలో శ్రీకృష్ణుడి లీలలను సంగీత స్వరాలతో అద్భుతంగా గానం చేశారు. ఈ సందర్భంగా కళాకారులను హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్కించన భక్తదాస అభినందించారు. భక్తి కళాకారులు తమ సంగీతం, నృత్యం ద్వారా సంప్రదాయ కళారూపాలను శ్రీకృష్ణుడికి హృదయపూర్వకంగా అందించడానికి ఈ వేదిక ఉపయోగపడుతుందన్నారు. శ్రీకృష్ణుడి సేవ కోసం ప్రతి ఆదివారం సాయంత్రం నిర్వహించే ఈ కార్యక్రమంలో పాల్గొనాలనుకునే ఆసక్తి గల కళాకారులు 95425 11108 నంబర్‌లో సంప్రదించాలని ప్రతినిధి అంబరీష దాస కోరారు.